క్లుప్తంగా

వాసవీ, వనితా క్లబ్‌ల చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల కేంద్రానికి చెందిన కోటేశ్వరి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలైంది. దీంతో ఆస్పత్రి ఖర్చులకు వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో సోమవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఈగ శ్రీనివాస్‌రావు, వనితా క్లబ్ ప్రధాన కార్యదర్శి చెరుకు కవిత, జిల్లా హెల్త్ ఇన్‌చార్జ్ రాచకొండ శ్రీనివాస్‌రావు, జిల్లా అమ్మ గౌరవం ఇన్‌చార్జ్ కందిబండ శ్రీనివాస్‌రావు, పాల్వాయి కృష్ణమూర్తి, నాటరాజు, సత్యనారాయణ, సత్యం, కోటేశ్వర రావు, వెంకటేశ్వర్లు, పద్మ తదితరులున్నారు.

టీపీఈటీఎఫ్ మండల అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ

గరిడేపల్లి : తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడిగా కర్నె లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మండాది సైదులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ప్రధాని నాగేశ్వరరావు, బాజోజు తిరుపతాచారి, మేకపోతుల నాగయ్య, వెంకటరాములు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి నిత్యాన్నదాన సత్రానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో గల రెడ్డి నిత్యాన్న సత్రం అభివృద్ధికి రఘునాథ పాలెంకు చెందిన బొబ్బా సీతారామిరెడ్డి కుమార్తె అల్లుడు సునీత- మురళీకృష్ణారెడ్డి దంపతులు అందజేసిన లక్షా నూట పదహారు రూపాయలను సత్రంలో కమిటీ అధ్యక్షుడు సాముల వెంకటేశ్వరరెడ్డికి సోమవారం అందజేశారు. సత్రానికి విరాళాలు అందజేయాలని అధ్యక్షుడు కోరారు. ఈ కార్యక్రమంలో సత్రం కమిటీ ఉపాధ్యక్షులు వీరంరెడ్డి శంభిరెడ్డి, శానంపూడి కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకా చౌదరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదరంగంలో శ్రీనివాస్ ప్రతిభ


బహుమతి అందుకుంటున్న శ్రీనివాస్

మునగాల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ పట్టణంలో గల శ్రీచెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 26వరకు నిర్వహించిన బిలో 1800 ఇంటర్నేషనల్ రేటింగ్ చదరంగం పోటీల్లో మునగాల మండల కేంద్రానికి చెందిన బంగారపు శ్రీనివాస్ బిలో 1500 కేటగిరిలో ప్రతిభ చాటి ఐదవ స్థానం సాధించాడు. మొత్తం 9 రౌండ్లకు గాను ఆరు రౌండ్లలో విజయం సాధించినట్లు ఆయన తెలిపారు. ఆదివారం రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో నిర్వాహకులు రూ.ఐదువేల నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేసినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


జానకీనగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి, కార్యదర్శి

చిలుకూరు : మండలంలోని జానకీనగర్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 3 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు, ప్రాథమిక పాఠశాలలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.3 లక్షలతో చేపట్టిన వంట గది నిర్మాణ పనులను సోమవారం గ్రామ ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ ఏఈ మానస ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన నాణ్యవంతంగా పూర్తి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రజిత, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకుడు భట్టు అమ్మనాయక్, గ్రామ శాఖ అధ్యక్షుడు నెల్లూరి భ్రమరాచారి, నాయకులు బర్నావత్ రాజేష్‌నాయక్, భట్టు శ్యామ్, బా లాజీ, రాఘవేంద్రరావు, రవి, వెంకటేశ్వర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలి

నడిగూడెం : సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లి వద్ద జరగనున్న పెద్దగట్టు జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలని యాదవ రాజ్యాధికార సాధన సమితి వ్యవస్థాపకుడు బడుగుల నాగార్జున యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరకు లక్షలాది మంది భక్తులు హాజరుకానున్నారన్నారు. ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

చేదబావులు కనుమరుగు!

ఒకప్పుడు గ్రామాల్లో ప్రజల దాహార్తి తీర్చిన చేదబావులు నేడు కనుమరుగవుతున్నాయి. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో ఉన్న చేదబావులు కొన్ని ఊర్లలో ఆనవాళ్లు లేకుండా పోగా, మరికొన్ని గ్రామాల్లో పూడిపోయి నిరుపయోగంగా మారాయి. ఇళ్లలో ఉన్న చేదబావులను పూడ్చివేడయంతో నేడు మచ్చుకకు కూడా కనిపించడంలేదు. మునగాల మండల కేంద్రంలో యాభై అరవై ఏళ్ల క్రితం నాటి గ్రామ సర్పంచ్ నల్లపాటి వెంకట్రామనర్సయ్య.. ప్రజల తాగునీటి అవసరాల కోసం వివిధ వార్డుల్లో పది బావులను తవ్వించారు. కాలక్రమేణా బోర్లు వేసుకోవడం, నల్లాలు ఏర్పాటు చేసుకోవడంతో ఆ చేదబావుల గురించి కథలుగా చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఇప్పటికీ నిరుపయోగంగా ఉన్న బావులను అందుబాటులోకి తెస్తే ప్రజల నీటి అవసరాలు తీరుతాయని మునగాలకు చెందిన లంజేపల్లి మట్టయ్య అంటున్నారు. -మునగాల


మాధవరం గ్రామంలోని ఓ వీధిలో నిరుపయోగంగా బావి



మునగాలలో గ్రామ పంచాయతీ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న మంచినీటి బావి

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

నేరేడుచర్ల : కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని నేరేడుచర్ల జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటరమణ అన్నారు. ఇంటర్‌లో విద్యార్థుల అడ్మిషన్ల కోసం సోమవారం నేరేడుచర్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, అధ్యాపకులు మద్దిమడుగు సైదులు, ప్రణతి, కేఎల్ నర్సింహారావు, కర్నాటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జాతీయ అవార్డుకు విద్యార్థి ఎంపిక


సాయి నవీన్


జాతీయ అవార్డుకు ఎంపికైన చిత్రం

చిలుకూరు : ఇంటర్నేషనల్ యంగ్ అండ్ చైల్డ్ ఆర్ట్ కాంపిటీషన్ -2025 అవార్డుకు చిలుకూరు మండలంలోని నారాయణపురం గ్రామ పరిధిలో గల ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి చెడపంగు సాయి నవీన్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డి. వెంకటేశ్వర్లు సోమవారం విలేకరులకు తెలిపారు. ఇంటర్నేషనల్ యంగ్ అండ్ చైల్డ్ ఆర్ట్ కాంపిటీషన్, ద జౌల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో గత సంవత్సరం డిసెంబర్‌లో ప్రపంచ స్థాయిలో నిర్వహించిన కలరింగ్ పోటీల్లో అండర్ 13- 17 విభాగంలో జాతీయ స్థాయి అవార్డుకు విద్యార్థి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వచ్చే నెలలో భువనేశ్వర్‌లో అవార్డు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆర్ట్ టీచర్ డాక్టర్ సూరేపల్లి నాగరాజు, విద్యార్థి నవీన్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

'లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు'


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న తాడువాయి గ్రామస్తులు

మునగాల : మండలంలోని తాడువాయిలో ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, అర్హులైన పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని సోమవారం మునగాల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు పలువురు గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమి, రాజకీయ పలుకుబడి, పక్కా ఇళ్లు ఉన్నవారిని, ప్రభుత్వ ఉద్యోగం ఉన్న వారిని పథకాలకు ఎంపిక చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు మళ్లీ సర్వే చేయించి అనర్హులను తొలగించి అర్హులైన వారిని ఎంపిక చేయాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆలేటి లక్ష్మీనారాయణ, జె.వెంకటేశ్వర్లు, బి.వీరన్న, కె.వీరస్వామి, కె.సుదరయ్య ఉన్నారు.

'తాడువాయిలో అనర్హుల ఎంపిక'

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామంలో నాలుగు సంక్షేమ పథకాలకు అనర్హులను ఎంపిక చేశారని బీసీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి కోల ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. భూమి, ఆర్థికంగా, రాజకీయ పలుకుబడి ఉన్నవారిని పథకాలకు అర్హులుగా ఎంపిక చేశారని తెలిపారు. అధికారులు జాబితాను పునఃపరిశీలించి అర్హులకే పథకాలు అందేలా చూడాలని కోరారు.

చిరస్థాయిగా నిలిచేలా నియోజకవర్గ అభివృద్ధి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో మంత్రి ఉత్తమ్ చేస్తున్న అభివృద్ధి చిరస్థాయిగా నిలిచి పోతుందని మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి అన్నారు. మంత్రి ఉత్తమ్ చేపట్టిన అభివృద్ధి పనుల ఛాయాచిత్రాలతో కూడిన క్యాలెండర్‌ను సోమవారం పట్టణంలో ఆవిష్కరించారు. కాంగ్రెస్ నాయకులు వెలిదండ వీరారెడ్డి, సులువ చంద్రశేఖర్, బాబురావు, రాము, సైదులు, రవీందర్, లక్ష్మణ్, రజాక్ బాబా, రాములు, శివ, రమేష్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులపై పూర్తిస్థాయి విచారణ చేయాలి

గరిడేపల్లి : కొత్త నాలుగు పథకాలకు ఎంపికైన లబ్ధిదారులు, కొత్తగా చేసుకున్న దరఖాస్తులపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఎంపీఓ హరినాయక్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పథకాల అమలుపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడాడరు. ప్రజాపాలన గ్రామసభలలో వచ్చిన దరఖాస్తులపై మరోసారి విచారణ చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యో గం ఉన్న కుటుంబానికి పథకాలు వర్తింపజేస్తే పూర్తి బాధ్యత పంచాయతీ కార్యదర్శి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏపీఓ సురేష్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కోదాడరూరల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కళాశాల బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన కోదాడ పట్టణంలో ఈ నెల 23న జరగగా.. బాధితుడి భార్య సోమవారం కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం దోరకుంటకు చెందిన అనుగోజు శ్రీనివాసచారి ఈ నెల 23వ తేదీన వ్యవసాయ మోటారు రిపేరు చేయించుకునేందుకు బైక్‌పై కోదాడకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల బస్సు అతడి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసచారికి తీవ్రగాయాలు కాగా స్థానిక వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి అతడిని మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. బాధితుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటం

కోదాడ : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ శక్తి వంచన లేకుండా నిరంతరం పోరాడుతుందని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోలా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కోదాడలో జరిగిన ఓ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే డైరీని ఆయన యూనియన్ బాధ్యులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు రాయపూడి చిన్ని, ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు గింజల అప్పిరెడ్డి, దాడుల నిరోధక కమిటీ అధ్యక్షుడు బాదె రాము, జర్నలిస్టులు కోట రాంబాబు, ఆవుల మల్లికార్జున్, సతీష్ పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సమాఖ్య క్యాలెండర్ ఆవిష్కరణ


రజక వృత్తిదారుల సమాఖ్య క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : వరంగల్‌లోని సిమెంటు అండ్ ఐరన్ సిండికేట్ కార్యాలయంలో ఈనెల 31న జరిగే బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు కోరారు. సోమవారం నేరేడుచర్లలో తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీసీలలో వెనుకబడిన కులాల వారే అత్యధికంగా ఉన్నారన్నారు. ఎస్సీలకు ఇచ్చే అన్ని రకాల రిజర్వేషన్లు రజకులకు కూడా వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా నాయకులు చిలకరాజు శ్రీను, వెంకట్, రెడ్డిపల్లి భిక్షం, కాశయ్య, రాజు, అచ్చయ్య, అంజయ్య తదితరులున్నారు.

రైతు మహాధర్నాను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ : రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా మంగళవారం నల్లగొండలో నిర్వహించబోయే రైతు మహాధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటిద్దు నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగే ఈ రైతు మహాధర్నాకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

గరిడేపల్లి : నల్లగొండలో మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే రైతు మహాధర్నాకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్, హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు.

హుజూర్‌నగర్‌రూరల్ : నల్లగొండలో మంగళవారం నిర్వహించే రైతు ధర్నాను విజయవంతం చేయాలని మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. సోమవారం అమరవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మునగాల: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను సోమవారం ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఎంపీఓ దార శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

ఎమ్మార్పీఎస్ కమిటీల ఎన్నిక

మునగాల : మండలంలోని సీతానగరం, రేపాల గ్రామాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలను మండల శాఖ అధ్యక్షుడు గుడిపాటి కనకయ్య మాదిగ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న జరిగే వేయి గొంతుకలు, లక్ష డప్పుల కార్యక్రమానికి ప్రతి ఇంటి నుంచి డప్పుతో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య మాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధికార ప్రతినిధి పేరెల్లి బాబు, గద్దల అశోక్ పాల్గొన్నారు.

కాగితరామచంద్రపురం కమిటీ..

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురంలో సోమవారం ఎమ్మార్పీఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాణాల వెంకట్, ఉపాధ్యక్షుడిగా అనిల్, ప్రధాన కార్యదర్శిగా స్వామి, మరో 10 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొలుగూరి సైదులు, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు మిట్టగణుపుల మోషే, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పందిటి నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ కార్యవర్గం..

నడిగూడెం : మండలంలోని కరివిరాలలో సోమవారం యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్.నజీర్, ఉపాధ్యక్షుడిగా పి.సతీష్, కార్యదర్శిగా శంకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండు మహేందర్, మాజీ సర్పంచ్‌లు గుర్రం నీలిమా గాంధీ, పాతకొట్ల నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ రణబోతు రమాదేవి, నాయకులు మిడిదొడ్డి శ్రీను, సోమగాని రామయ్య, చింతలపాటి శ్రీను, కృష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి, చంద్రశేఖర్, వెంకన్న, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఉత్తమ్ దంపతుల చిత్రపటానికి పాలాభిషేకం


నడిగూడెం : ఉత్తమ్ దంపతుల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురం గ్రామాన్ని సంక్షేమ పథకాల అమలు ప్రారంభానికి పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిన సందర్భంగా సోమవారం ఆ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ముదిరెడ్డి నళిని, సింగిల్ విండో చైర్మన్ గోసుల రాజేష్, నాయకులు అలుగుబెల్లి గుర్వారెడ్డి, నాగిరెడ్డి లింగారెడ్డి, అల్లుబెల్లి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

హుజూర్‌నగర్ : ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రిసెప్టర్, డాక్టర్ ఎం.రామారావు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని ఏరియా హాస్పిటల్‌లో డాక్టర్లు, వైద్య సిబ్బందికి ధ్యానంపై అవగాహన కల్పించి మాట్లాడారు. ధ్యానంను జీవితంలో ఒక భాగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయుష్ యోగా ఇన్‌స్ట్రక్టర్ బి.రామాంజరెడ్డి, ఎన్.మహేందర్, బీసీహెచ్.వెంకటేశ్వర్లు, డాక్టర్ వనజ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామ మాజీ సర్పంచ్ కొప్పుల వీరమ్మను సోమవారం ఆమె నివాసంలో గ్రామానికి చెందిన బహుజన నాయకుడు, సామాజిక ఉద్యమకారుడు రాయిరాల సుమన్ ఘనంగా సత్కరించారు. అనంతరం సుమన్ మాట్లాడుతూ వీరమ్మ తన ఐదేళ్ల పదవీకాలంలో గ్రామాన్ని అభివృద్ధి చేశారని, కానీ నేటికీ బిల్లులు రాక అవస్థలు పడుతున్నారని తెలిపారు. సురేష్, పవన్, అశోక్, సాయి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మునగాల : మండలంలోని ఆకుపాముల సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నందున మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ వికాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు, వ్యాపార సంస్థల యజమానులు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్‌తో మళ్లీ చీకటి రోజులు

● మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్


అనంతగిరి : సమావేశంలో మట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

అనంతగిరి : మార్పు చేస్తున్నామని చెబుతూ కాంగ్రెస్ నాయకులు మళ్లీ చీకటి రోజులను తెచ్చారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. సోమవారం అనంతగిరి మండలంలోని చనుపల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నల్ల భూపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. ఏడాది పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి నెలకొందని ఆయన విమర్శించారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతకు భయపడి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టడంలో కాలయాపన చేస్తుందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గులోత్ శ్రీనివాస్ నాయక్, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ ఉషారాణి హనుమంత రావు, నాయకులు మట్టపల్లి పుల్లయ్యగౌడ్, పూర్ణచందర్, అఫ్జల్, భిక్షం, మట్టపల్లి సైదులు,అన్ని గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మధు మృతి బాధాకరం

మోతె : మండలంలోని నేరడవాయి గ్రామానికి చెందిన కండక్టర్ దారమళ్ల వెంకన్న కుమారుడు దారమళ్ల మధు ఇటీవల గుండెపోటుతో మరణించారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్.. కండక్టర్ వెంకన్న దంపతులను పరామర్శించారు. మధు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధు అకాల మృతి బాధాకరమన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు, జిల్లా నాయకులు ఏలూరి వెంకటేశ్వరరావు, శ్రీధర్‌రెడ్డి, హనుమాచారి, కుక్క భిక్షం, సతీష్, బొజ్జనాయక్, ఎల్. శ్రీను, గోవర్ధన్, తదితరులు ఉన్నారు.

మంద కృష్ణకు పద్మశ్రీ రావడంపై హర్షం


నేరేడుచర్లలో మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నేరేడుచర్ల : మహాజన నేత మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ పురస్కారం రావడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం నేరేడుచర్లలోని ప్రధాన కూడలిలో మంద కృష్ణ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇంజమూరి మల్లయ్య, ఎమ్మెస్పీ జిల్లా నాయకుడు యడవల్లి చంద్రయ్య, మండల అధ్యక్షుడు యడవల్లి అరుణ్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల పాటు అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి మంద కృష్ణ అని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇంజమూరి పున్నయ్య, పల్లెపంగ నాగరాజు, రణపంగ నాగయ్య, భరత్, శ్రీను, వెంకటేశ్వర్లు, ఉపేందర్, ఉదయ్, లక్ష్మయ్య, రవి, గోపి, అబ్రహం, వీరబాబు, రామకృష్ణ, వెంకన్న, హిందూజ, నగేష్, మధు, నవీన్, రామస్వామి, సైదులు తదితరులు ఉన్నారు.

మంద కృష్ణ మాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం


కోదాడరూరల్: పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కోదాడరూరల్ : గత మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణతో పాటు వితంతు, వికలాంగుల పెన్షన్ కోసం మంద కృష్ణ చేసిన పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ ఇవ్వడం పట్ల మాదిగ అనుబంధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజుమాదిగ, పడిశాల రఘు, కర్ల విజయరావు, మంద వెంకటేశ్వర్లు, కంభంపాటి శ్రీనివాస్, గంధం పాండు, చీమ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఖాతాదారులకు అవగాహన కల్పించాలి


బ్యాంకుల మేనేజర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్ : బ్యాంకుల వద్ద జరిగే నగదు మోసాలు, దొంగతనాలపై బ్యాంకర్లు ఖాతాదారులకు అవగాహన కల్పించాలని ఎస్ఐ ముత్తయ్య అన్నారు. పట్టణంలోని అన్ని బ్యాంక్ మేనేజర్లతో సోమవారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, బ్యాంకుల వద్ద ఖాతాదారుల దృష్టి మరలింపు గురించి చర్చించారు. బ్యాంక్ ఆవరణలో సైబర్ మోసాల గురించి ఫ్లెక్సీలు, క్లారిటీ సీసీ కెమెరాలు అమర్చాలని కోరారు. ఎక్కువ మొత్తంలో డబ్బులు డ్రా చేసి తీసుకెళ్లే వ్యక్తులకు నగదు భద్రత గురించి వివరించాలని ఆయన తెలిపారు. బ్యాంకు ఆవరణలో సెక్యూరిటీ గార్డును నియమించుకోవాలని చెప్పారు. బ్యాంక్‌కు వచ్చి వెళ్లే వారిని గమనించాలని, ఎవరిపైనైనా అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో బ్యాంక్‌ల మేనేజర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు ఘన సన్మానం


నేరేడుచర్ల : తహసీల్దారు సైదులును సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


నడిగూడెంలో డాక్టర్ అఖిలను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నేరేడుచర్ల : ఉత్తమ ఉద్యోగులుగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు అందుకున్న అధికారులను సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నేరేడుచర్ల తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ సైదులు, ఆర్ఐ నరసయ్యను బీఆర్ఎస్ నాయకులు రాపోలు నవీన్, పిచ్చిరెడ్డి, నాగార్జున, హేమ్లనాయక్, రాంరెడ్డి, దిప్లానాయక్ సన్మానించారు. ఉత్తమ మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డిని మున్సిపల్ ఉద్యోగులు, మాజీ పాలక వర్గ సభ్యులు సత్కరించారు. పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్, ఉద్యోగిని నాగిని, సీహెచ్‌ఓ శ్రీనివాస్‌లను ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉత్తమ అధ్యాపకుడు సైదులు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటరమణను అధ్యాపక బృందం సత్కరించింది.

పశువైద్యాధికారి అఖిలకు సన్మానం

నడిగూడెం : ఉత్తమ వైద్యాధికారిగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా పురస్కారం పొందిన మండల పశువైద్యాధికారి డాక్టర్.బి.అఖిలను సోమవారం బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో స్థానికంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు భోనగిరి ఉపేందర్, ప్రధాన కార్యదర్శి కాసాని సతీష్, నాయకులు దాసరి శ్రీనివాస్, దున్నా రవి, మేకల వీరబాబు, ఎండీ.జలీల్, బుడే సాహెబ్, దున్నా ప్రవీణ్ కుమార్, సైదులు, అభిమన్యు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్ : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం హుజూర్‌నగర్‌లో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ వాహనాల ధృవపత్రాలు తమ వెంట ఉంచుకోవాలని చెప్పారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.